ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం



అనకాపల్లి



మత్స్యకారులను ముంచేస్తారా!



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- చేపలరేవులో ఏళ్ల తరబడి బోట్లకు స్థల సమస్య
- 20కి పైగా నీటమునిగిన వెసెల్స్
- బయటకు తీయకుండా పోర్టు అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం చేపల రేవు (ఫిషింగ్ హార్బర్)లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన బోట్లు మంటల్లో కాలిబూడిదైన ఘటన మత్స్యకారుల బతుకులను ఛిద్రం చేసింది. పేద, సామాన్య మత్స్యకారులే వేల సంఖ్యలో ఫిషింగ్ హార్బర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. ఏళ్లతరబడి ఇక్కడి మత్స్యకారులు నిండా సమస్యల్లో మునిగితేలుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రమాదంతో వారి జీవితాలు దినదిన గండంగా మారుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కంటే వైజాగ్ పోర్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీరి జీవనోపాధిపై నీలినీడలు అలముకుంటున్నాయి. క్రమంగా వీరిని సముద్రంలో నిలువునా ముంచేస్తారా? అనే ప్రశ్నలు అన్ని వైపుల నుంచీ వినిపిస్తున్నాయి.

ఫిషింగ్ హార్బర్‌లో అసలు సమస్యేమిటి?

ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 1100కు పైగానే మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయి. 10వేల మంది మత్స్యకారులు జీవనాధారం సాగిస్తుంటారు. ఈ బోట్లలో 500 నిత్యం లంగరు వేసి ఉంటాయి. విశాఖ పోర్టు అథారిటీ (విపిఎ) నియంత్రణలో వైజాగ్ ఫిషింగ్ హార్బర్ ఉంటుంది. ఏ సమస్య తలెత్తినా పోర్టు అధికారులు ప్రాథమికంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని బోట్లు వేటకు వెళ్లగా కొన్ని ఇలా నీటిపై ఉంటాయి. రిపేర్లు

మిగతా 2లో..



రోధిస్తున్న మత్స్యకార మహిళలు



ప్రమాద స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సిదిరి అప్పలరాజు



ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో ఆస్ట్రేలియా క్రికెటర్లు

నగరానికి చేరిన క్రికెటర్లు

ప్రజాశక్తి -పిఎం పాలెం : డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ- విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 23న నిర్వహించనున్న భారత్, ఆసీస్ టి-20 అంతర్జాతీయ మ్యాచ్‌కు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భారత్, ఆసీస్ క్రికెటర్లు సోమవారం నగరానికి చేరుకున్నారు. రుషికొండ సమీపంలో ఉన్న రాడిస్సన్ బ్లూ హోటల్‌లో ఇరుజట్లు ఆతిథ్యం పొందాయి. సోమవారం సాయంత్రం పిఎం పాలెంలోని ఎసిఎ, విడిసిఎ క్రికెట్ స్టేడియానికి ముందుగా ఆస్ట్రేలియా జట్టు క్రికెటర్లు చేరుకొని ప్రాక్టీస్ మొదలుపెట్టారు. అనంతరం భారత్ క్రికెటర్లు మైదానానికి వచ్చి ప్రాక్టీస్ ప్రారంభించే సమయానికి వర్షం రావడంతో హోటల్‌కు వెనుదిరిగారు. ఇప్పటికే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు అమ్మకాలు పూర్తికావచ్చాయని, స్టేడియంలో ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపాదికన పూర్తికావస్తున్నాయని ఎసిఎ సెక్రటరీ ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి తెలిపారు.

కులగణనపై సలహాలివ్వండి : జెసి

ప్రజాశక్తి-విశాఖపట్నం : రాష్ట్రంలో నిర్వహించనున్న కులగణన సమగ్ర నిర్వహణ కోసం తగిన సలహాలు, సూచనలు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ వివిధ కులసంఘాల చైర్మన్లు, డైరక్టర్లను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కులగణన - 2023పై ప్రాంతీయ సదస్సు

మిగతా 2లో..

అదానీ వ్యాపారాన్ని వృద్ధి చేయడమే మోడీ కర్తవ్యం

వార్త మెయిన్‌లో..

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

వార్త 5లో..

కొనసాగుతున్న 'బిఆర్‌టిఎస్' తొలగింపులు

వార్త 3లో..

మత్స్యకారులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

వార్త 8లో..



నక్కపల్లి మండలంలోని మనబాలవానిపాలెంలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

వార్త 8లో...

తాడి తరలింపు జరిగేనా?



తరలింపును నోచుకోని తాడి గ్రామం

- రీ సర్వేకు ప్రభుత్వం ససేమిరా
- పాత జాబితా ప్రకారమే పరిహారం చెల్లింపు
- నష్టపోనున్న ఫార్మా కాలుష్య బాధిత ప్రజలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పరవాడ ఫార్మా కాలుష్య ప్రమాదం నుంచి బాధిత తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలకు ఇప్పట్లో విముక్తి లభించినట్లు లేదు. కాలుష్య బాధ భరించలేక బాధితులే ఊరొదిలి పోతారని చూస్తున్నట్లుంది తప్ప, సురక్షిత ప్రాంతానికి తరలించి వారిని ఆదుకోవాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉన్నట్లులేదు. గత ప్రభుత్వం వలె, ఎన్నికలు సమీపిస్తుండడంతో తాడి తరలింపులో కదలిక ఉన్నట్లు నమ్మించే ప్రయత్నాలు ఆరంభించింది. బాధితులకు స్థలాలు ఇవ్వడానికి పెదముషిడివాడ భూమిని చదును చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బాధిత ప్రజలు కోరుతున్నట్లు మేజర్ కుమారులు, కుమార్తెలను గుర్తించేందుకు తాజాగా సర్వే చేయడానికి ప్రభుత్వం సిద్ధంగాలేదు. ప్రస్తుత ధరల ప్రకారం ఇళ్ల ధర నిర్ణయించి పరిహారం ఇవ్వడానికి కూడా ముందుకురావడంలేదు. 2017లో చేసిన సర్వే ప్రకారం తయారుచేసిన జాబితా ఆధారంగా ఇళ్లకు డబ్బులు చెల్లించాలని ఆలోచిస్తోంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌ను పట్టించుకోవడంలేదు.

వారం పది రోజుల్లో తాడి గ్రామం తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నాటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఏడాదిన్నర తరువాత ఇప్పుడు భూమిని చదును చేస్తున్నట్లు అధికార పార్టీ

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మత్స్యకారులను ముంచేస్తారా!

చేసుకోవాలంటే స్థల సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. ఇరుకు ఇరుకుగా బోట్లను లంగరు వేయాల్సిన పరిస్థితులు చేపల రేవులో నెలకొనడానికి కారణం స్థల సమస్య. తాజాగా హార్బర్లోని చేపల వేలం పాట వేసిన చోట ఈ ప్రమాదం ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో చోటుచేసుకుంది. గ్యాస్ సిలిండర్లు బోట్లలోనే మత్స్యకారులు తమ ఆహారం కోసం ఉంచుకోవడం ఆనవాయితీ. ఒక బోటులో మంట రగిలితే మిగతా వాటికి వ్యాపించడం చాలా సులువుగా జరిగిపోవడానికి కారణం అన్నీ ఒకదానిపై ఒకటి ఉన్నట్టుగా బోట్లు ఉంటాయి. పైగా తుపాను కారణంగా ఆదివారం రాత్రి గాలి తీవ్రత సముద్రంపై ఉంది. దీంతో 50 నుంచి 60 బోట్ల వరకూ దగ్ధమైనట్లు తెలుస్తోంది. అసలు ఈ సమస్యకు ప్రధాన కారణం వెనక్కి వెళ్లి చూస్తే... బోట్లను ఉంచేందుకు హార్బర్లో స్థలం లేదు. ఏళ్లతరబడి ఫిషింగ్ హార్బర్ జీరో నెంబరు జెట్టీ, జెట్టీ 2, 7, 11లో సుమారు 20 వెసెల్స్ వరకూ మునిగిపోయాయి. ఇవి ఐరన్ బోట్లు కావడంతో సముద్ర ఒడ్డు ఈ జెట్టీల ప్రదేశం కాబట్టి ఈ ప్రాంతంలో బోట్లు ఉంచేందుకు అనువుగా పరిస్థితులు లేవు. ఈ వెసెల్స్‌ను పోర్టు అధికారులు వెలికి తీయాల్సి ఉన్నా ఆ పని చేయనందున చాలా స్థలాన్ని ఈ మునిగిపోయిన వెసెల్స్ ఆక్రమించేశాయి. ఒకవేళ ఏదైనా బోటు ఈ పైన తెలిపిన జెట్టీలపై నిలపాలన్నా మునిగిన వెసెల్స్ బోట్లు ఐరన్‌వి కావడంతో మత్స్యకారుల బోట్లు కన్నం పడిపోయినీరు వెళ్లిపోయి ఇవి కూడా మునిగిపోతున్నాయి. ఇలా 2022లో 2 బోట్లు మునిగిపోయి మత్స్యకార కుటుంబాలు నష్టపోయాయి. ఈ సమస్యపై ఎన్నిసార్లు పోర్టు అధికారులకు ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం తరపున జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లిఖార్జునకు, వైజాగ్ పోర్టు ఎఐబి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ 'ప్రజాశక్తి ప్రతినిధి'కి సోమవారం తెలిపారు.

మునిగిన వెసెల్స్ ప్రధాన సమస్య..

చేపల రేవులో ఏళ్లక్రితం అండర్ గ్రౌండ్‌లో మునిగిపోయిన వెసెల్స్ అన్నీ అప్పట్లో భారీగా చేపల వేట, ఎగుమతుల్లో రూ.కోట్లకు పడగలెత్తిన ఓనర్లంతా రాజకీయ వ్యాపారులే. వీరితో పోర్టు అధికారులు మిలాఖత్ అయిపోయి ఇన్సూరెన్స్‌ను ఈ బోట్లకు రప్పించుకుని మునిగిన బోట్లను వెలికి తీయకుండా తీవ్ర తాత్సారం చేస్తున్నారు. ఒకవేళ తీస్తే పోర్టు అధికారులు దీంట్లో పాత్ర ధారులు కావడం వల్ల తమ మెడకు ఇన్సూరెన్స్ వ్యవహారం చుట్టుకుంటుందన్న ఆందోళనా లేకపోలేదు. ఫిషింగ్ హార్బర్లో మత్స్యకారులు ఇలా పోర్టు అధికారులు, బడా వ్యాపారుల ఆగడాలకు బలైపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం పట్టడం లేదన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

కొసమెరుపు?

మొత్తం ఈ వ్యవహారంపై పోర్టు అధికారులు కొంతమంది తాజాగా మాట్లాడుతూ ఆస్ట్రేలియాపై ఇండియా మ్యాచ్ పోవడం వల్ల ఆకతాయిలెవరో ఇలా చేసి ఉంటారని వారిపై నెపం నెట్టేయడం చూస్తే ఈ ప్రమాదంపై వీరికి గల బాధ్యత స్పష్టమవుతోంది.

తాడి తరలింపు జరిగేనా?

చెప్పుకుంటోంది. ఎన్నికలకు ముందు తాడి, చినతాడి, బిసి.కాలనీ ప్రజలను పెదముషిడివాడ తరలించడానికి టిడిపి ప్రభుత్వం రూ.57.63 కోట్లు విడుదలచేస్తూ 2019 ఫిబ్రవరి 6న జిఒ 29 విడుదలచేసింది. కానీ పైసా విడుదల చేయలేదు. సిఎం జగన్మోహన్‌రెడ్డి రూ.56 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించినా, ఇంతవరకు తరలింపు పని ప్రారంభించలేదు. ఎన్నికలు సమీపించడంతో బాధితుల ఇళ్లకు పరిహారం చెల్లించేందుకు తొలి దశ కింద డిసెంబరులో రూ.36 కోట్లు ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు ప్రచారం చేస్తోంది. మిగిలిన సొమ్ము మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయనున్నట్లు చెబుతోంది. తరలింపు విషయం పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు వద్ద ప్రస్తావిస్తే, పెదముషిడివాడ భూమి చదును చేస్తున్నామని అన్నారు. ఇళ్లకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన రూ.36 కోట్లు డిసెంబరు 10లోపు ప్రభుత్వం విడుదల చేయనుందన్నారు. మేజర్ కుమారులు, కుమార్తెలను గుర్తించేందుకు గ్రామస్తులు రీ సర్వే చేయాలని కోరుతున్న విషయం తన దృష్టికి రాలేదని, గతంలో తయారుచేసిన జాబితా ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెప్పారు.

కులగణనపై సలహాలివ్వండి : జెసి

జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సోమవారం ఉదయం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరినాలో నిర్వహించారు. ఈ సదస్సుకు సుమారు 64 కులాలకు చెందిన ఛైర్మన్లు, డైరెక్టర్లు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కులాల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, 1931సంవత్సరంలో పూర్తిస్థాయిలో కులగణనతో కూడిన జనగణన జరిగిందని, తర్వాత దాదాపు 92 ఏళ్ల పూర్వవుతున్నా ఇప్పటివరకు కులగణన చేపట్టలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం సర్వే చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సర్వే నిర్వహించడంలో వివిధ కుల సంఘాలకు తలెత్తే అనుమానాలు, సమస్యలు, ఉపయోగాలపై తగిన సలహాలు, సూచనలు కోరేందుకు ఈ సదస్సును ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

ప్లాంట్ పరిరక్షణకు ఎలాంటి త్యాగానికైనా సిద్ధం

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ ఆదినారాయణ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1012వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ప్లాంట్ ట్రాఫిక్, ఆర్ఇడి, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ, ఉక్కు పరిశ్రమతో సంబంధం లేని వ్యక్తులను ఉన్నత స్థానాలలో నియమించడం ప్లాంటు నష్టాలకు మరో కారణమన్నారు. అష్టదిగ్బంధనంలో విశాఖ ఉక్కు పరిశ్రమ భవిష్యత్తు, ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల మేధావులు స్పందించకపోతే పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కారు రమణ, బొడ్డు రమణ, ఎస్.శ్రీనివాస్, ఎస్ఎస్.రెడ్డి, కుసుమ శ్రీను, పాపారావు, కె.సంతోష్, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి నైట్ షెల్టర్ల పరిశీలన



జివిఎంసి నైట్‌షెల్టర్లను పరిశీలిస్తున్న అతిష్‌చంద్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో జివిఎంసి నిర్వహిస్తున్న నైట్ షెల్టర్ల నిర్వహణను ప్రైమ్ మినిస్టర్ అడిషనల్ సెక్రటరీ అతిష్ చంద్ర పరిశీలించారు. శనివారం ఆయన విశాఖ నగరానికి వచ్చిన ఆయన జివిఎంసి నిర్వహిస్తున్న 8 నిరాశ్రయ కేంద్రాలలో టిఎస్ఆర్ కాంప్లెక్స్, భుపేష్‌నగర్‌లో నిర్వహిస్తున్న నిరాశ్రయ కేంద్రాలను ఎపియుఎఫ్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా నిరాశ్రయ కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతూ నైట్ షెల్టర్లో ఎంత మంది నిరాశ్రయులు వున్నారు. వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో భాగంగా భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, వసతి, విద్యుత్, తాగునీటి సరఫరా, డార్మిటరి, వినోదం కోం టీవీ, సిసి.టివి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడు, డిపిఒ లక్ష్మి, నిర్వాహకులు ప్రగడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఓపెన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఎన్‌గ్రేవ్, శ్రీ చెస్ అకాడమీల ఆధ్వర్యాన ఈ నెల 25, 26 తేదీల్లో స్టేట్ రోలింగ్ ట్రోఫీ చెస్ పోటీలు మాధవధారలోని మాధవస్వామి కల్యాణమండపంలో నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్లు బాబూరావు, శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రూ.30 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అండర్ -7 క్రీడాకారులందరికీ ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో అన్ని వయస్సుల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 98493 71760, 99899 71232 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రంజిత్ ప్రాపర్టీస్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రంజిత్ ప్రాపర్టీస్ 3వ వార్షికోత్సవం సోమవారం దసపల్లా హోటల్లో నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు పేడాడ రమణికుమారి కేక్ కట్ చేసి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథులుచే కొత్త వెంచర్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఆంధ్ర యూనివర్సిటీ వీసీ పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, గన్నమని వెంకటేశ్వర రావు(జివి), రంజిత్ ప్రాపర్టీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రంజిత్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల భరత్ తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బిఆర్‌టిఎస్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సింహాచలం దగ్గర బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో బాధితులకు తక్షణమే న్యాయంచేయాలని టిడిపి నాయకులు డిమాండ్‌చేశారు. ఆకస్మికంగా గృహాలను తొలగించడం అన్యాయమంటూ సోమవారం కలెక్టరేట్ స్పందనలో బాధితులతో కలిసి జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి గండి బాబ్జీ, నాయకులు పాశర్ల ప్రసాద్, కోరాడ రాజబాబు తదితరులు ఉన్నారు.

3న ముడసర్లోవలో విశాఖ కాపు యూత్ కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ముడసర్లోవ పార్కులో విశాఖ కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ తేదీన కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్ తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపు, తూర్పుకాపు, తెలగ, బలిజ, మున్నూరు కాపు కులాలకు చెందిన వారికోసం వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జనరల్ సెక్రటరీ ఎర్రంసెట్టి సురేష్ మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను అసోసియేషన్ నాయకుడు గొల్లకోట సుబ్బారావు, గంట్ల శ్రీనుబాబు ఆవిష్కరించారు. సమావేశంలో బలిరెడ్డి సుహాస్, ఎస్.సత్యనారాయణ, చిరంజీవి, చిన్నా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని, ఎంపీ ఎంవివి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జివిఎంసి 19వ వార్డు పరిధిలోని లాసన్స్ బే బీచ్ పార్కులో సుమారు రూ.36.53 లక్షలతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణతో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, జివిఎంసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. లాసన్స్ బే బీచ్ పార్కులో యోగ వేదిక, షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్, మరమ్మత్తు పనులు నూతనంగా బెంచీలు ఏర్పాటు, తాగునీరు, పైపులైన్లు ఏర్పాటు, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర పనులు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ ఎంవివి మాట్లాడుతూ, విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలో ప్రతి వార్డులో ప్రజలకు అవసరమయ్యే కనీస అవసరాలు తీర్చేందుకు జివిఎంసి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

జివిఎంసి 19వ వార్డు పరిధిలోని జాలారిపేట కురుపాం జంక్షన్ నుంచి బాపూజీనగర్ వరకు సుమారు రూ.93.35 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి ఎంపీ ఎంవివి.సత్యనారాయణతో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతుల కల్పనే జివిఎంసి ధ్యేయమన్నారు. నగరంలోని ప్రతి వార్డునూ అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'బిఆర్‌టిఎస్' తొలగింపులు

బాధితులకు అండగా కర్రి అప్పలస్వామి ట్రస్ట్

ప్రజాశక్తి- సింహాచలం: బిఆర్‌టిఎస్ రోడ్డు పనుల్లో భాగంగా ఇళ్ల తొలగింపు ప్రక్రియ మూడో రోజు సోమవారం జివిఎంసి అధికారులు చేపట్టారు. బిఆర్‌టిఎస్‌రోడ్డులో రాకపోకలు నిలుపుదల చేయడంతో ఉదయం పాఠశాలలు, ఆఫీసులకు వెళ్లేవాళ్లు చెరువు పక్క ఇరుకు రోడ్డును ఆశ్రయించడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడి తీవ్ర అవస్థలు పడ్డారు.రెండు రోజులుగా ఆక్రమణల తొలగింపుతో రోడ్డున పడ్డ నిర్వాసిత బాధితులు తిండి, నివాసానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఉన్నఫలానా అద్దెకు సైతం ఇళ్లుదొరకకపోవడంతో చలిలో రోడ్లపైనే తిండి, నిద్ర చేయాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు.

బాధితులకు స్థానిక కర్రి అప్పలస్వామి స్వామి ఛారిటబుల్ ట్రస్ట్ మూడురోజులుగాసేవలను కొనసాగిస్తోంది. సోమవారం ఉదయం బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, అడవివరం పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి అప్పలస్వామి మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడంతో తమ ట్రస్ట్ ఎపుడూ ముందుంటుందన్నారు. బాధితులకు ప్రభుత్వం వెంటనే తగు న్యాయం చేయాలని కోరారు.

ఒకటో తేదీన పెన్షన్ చెల్లించండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ పింఛనుదారులు ఎస్‌టిఓ అప్పలరాజును కోరారు. సోమవారం ఎస్‌టిఓ కార్యాలయంలో పెన్షనర్ల సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షనర్లు మృతి చెందితే దహన సంస్కారాల సాయం రూ.20వేలు తక్షణం అందించాలని కోరారు. సమావేశంలో పెన్షనర్లసంఘం భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు టి భీమారావు, ఎంఆనందరావు, ఉపాధ్యక్షులు కె సత్యానారాయణ, సభ్యులు బి గురుమూర్తి, అప్పారావు పాల్గొన్నారు

కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండల వైసిపి గ్రీవెన్స్ జనరల్ సెక్రెటరీ, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు రౌతు శ్రీను ఆధ్వర్యంలో స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సౌజన్యంతో రూ.20వేలు విలువచేసే రెండు కుట్టు మిషన్లను ద్వారా ఇద్దరికి పంపిణీ చేశారు. సోమవారం శొంఠ్యాం గ్రామానికి చెందిన లెంక నాగమణి, పట్నాల కోమలికి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మహిళల ఆర్థికాభివృద్ధికి స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సేవలను శ్రీను ప్రశంసించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కలగట్ల శ్రీరామచంద్ర మూర్తి. భానోజీరావు, శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు

ఔషధ గుణాల మొక్కలు నాటివేత

ప్రజాశక్తి- వేపగుంట : ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటాలని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారంకార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మద్రిపాలెం ఉడా లేఅవుట్ నూతన పార్క్‌లో హరితహారంలో భాగంగా స్థానికులతో కలసి మొక్కలు నాటారు. ఔషధ గుణాలు కలిగిన తులసి, రావి, వేప, మారేడు, మద్రి, అశోక, ఉసిరి, అరటి, చందనం, వెదురు, మేడి, జమ్మి ,మామిడి వంటి మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో రత్నం, సన్యాసప్పారావు , దినేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

ప్రజాశక్తి- పద్మనాభం: మండలంలోని తునివలస గ్రామపంచాయతీలో రూ.81.16 లక్షలతో నిర్మించిన పలు భవనాలను సోమవారంఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. రూ. 21.8 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.8 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, ప్రారంభించారు. గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణ, సర్పంచ్ సుంకర పైడిరాజు పాల్గొన్నారు

అప్పన్న సన్నిధిలో లక్ష్మణ్ దంపతులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను సోమవారం భారత మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు స్వామి ప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులకు జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మఆదేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి పరిధిలో చేపట్టిన పలు రోడ్లు కల్వర్టులు, కూడళ్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జివియంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం కైలాసగిరి నుంచి విశాలాక్షినగర్, చినగదిలి, బోయపాలెం, కె.నగర పాలెం వరకు రోడ్లు, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కైలాసగిరి నుంచి విశాలాక్షినగర్ రోడ్డు, ఫుట్‌పాత్‌లు, లైటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెదగదిలి కూడలి గ్రీన్‌బెల్ట్‌లో అనధికారికంగా వెలసిన బడ్డీలను, తోపుడు బళ్లను వెంటనే తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎఎంహెచ్‌ఒ డాక్టర్ కిషోర్‌కు ఆదేశించారు. చినగదిలి, సూర్యతేజనగర్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న వంతెనను, రోడ్డు విస్తరణ, కాలువలు, ఫుట్‌పాత్, సెంటర్ మీడియన్ నిర్మాణ పనులను పరిశీలించి, వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, అక్కడ హైమాస్ట్ లైట్‌ను, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ముడసర్లోవ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో కోజ్డ్ కాంపిక్టర్ సిస్టం వాహనాల ద్వారా వ్యర్థాలను తరలించే నిర్మాణాన్ని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ డిడి దామోదరరావు, జెడ్‌సిలు కనకమహాలక్ష్మీ, రాము, డిసిపి నరేంద్రరెడ్డి, ఎసిపి శాస్త్రి, డిఇఇలు ప్రసాద్, వంశీ, టిపిఓ మూర్తి పాల్గొన్నారు.



సూర్యతేజనగర్ వంతెన పనులను పరిశీలిస్తున్న కమిషనర్

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి బాలలు మంచి పౌరులుగా పేరు తెచ్చుకోవాలని లోక్ అదాలత్ శాశ్వత చైర్మన్ వల్లభనాయుడు, డిఎల్‌ఎస్‌ఎ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ, ఐసిఐసిఐ ఛీఫ్ మేనేజర్ మణిమాల తెలిపారు. దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో బాలల వారోత్సవాల ముగింపు వేడుకల్లో మాట్లాడుతూ బాలురు సత్ప్రవర్తనతో మెలిగాలని సూచించారు. అనంతరం వారికి దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేసారు. కార్యక్రమంలో గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన 14 ఏళ్ల లోపు బాలురు, బాలికలకు భీమిలి జీవిఎంసి ఫుట్‌బాల్ గ్రౌండ్, చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో 67 వ అంతర్ జిల్లాల ఫుట్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 468 మంది క్రీడాకారులు, 52 మంది కోచ్‌లు, మేనేజర్లు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 20 మంది రిఫరీలు పాల్గొంటారన్నారు

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- గాజువాక : స్థానిక చైతన్యనగర్‌లోని చైతన్య టెక్నో పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం అరుణకుమారి జ్యోతిప్రజ్వళన అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఒ సత్యనారాయణ, మిడ్ స్కూల్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులను ఎజిఎం సురేష్, ఆర్ఐ మాకిరెడ్డి రమణ అభినందించారు.

పంచగ్రామాల సమస్యకు త్వరలోనే పరిష్కారం

ప్రజాశక్తి- పెందుర్తి : పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. సోమవారం సుజాతనగర్ వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ విపక్షంలో ఉన్నపుడు దీనిపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. ఇటీవలే ఇళ్ల మరమ్మతులకు వీలుగా జిఒ విడుదల చేశామన్నారు.

తునివలసలో గడపగడపకూ..

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని తునివలస సచివాలయ పరిధిలో సోమవారం గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు. వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్. బంగారప్పడు, ఎంపిటిసి కె. సూర్యనారాయణ, పాల్గొన్నారు,

అన్నసమారాధన

ప్రజాశక్తి- సీతమ్మధార : తాటిచెట్లపాలెం సమీపంలో పోర్టు హాస్పిటల్ ఎదురుగా ఎరుమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష స్వాములకు అన్నప్రసాద కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొని అయ్యప్ప స్వాములకు వడ్డించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణకు సహకరించిన కె.కె రాజుకు ట్రస్ట్‌ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

సూర్య జూనియర్ కళాశాలకు తాళం

ప్రజాశక్తి- గాజువాక: జివిఎంసికి పన్ను చెల్లించలేదని గాజువాకలోని శ్రీ సూర్య జూనియర్ కళాశాల కార్యాలయానికి రెవెన్యూ విభాగం సోమవారం తాళం వేశారు. రూ.6.58వేలు పన్ను బకాయి చెల్లించాల్సి ఉందని, ఈ నేపథ్యంలో డిసిఆర్ ఆదేశాల మేరకు గాజువాక రెవిన్యూ అధికారి రాం నారాయణ ఆధ్వర్యంలో తాళం వేశారు.

స్టీల్ త్రిఫ్ట్ సొసైటీలో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను సంఘ ఉపాధ్యక్షులు కె. ఆనందకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా డివిజనల్ కోపరేటివ్ అధికారి .పి.దుర్గాప్రసాద్ పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని క్రమశిక్షణతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ సొసైటీగా పురోభివృద్ధి సాధించడం అభినందనీయమన్నారు. సహకార యూనియన్ లెక్చరర్ జి.సోమేశ్వరరావు సహకార జెండా విశిష్టతను వివరించారు. కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూఈ ఏడాది 'సహకార విద్య, శిక్షణ పునరుద్ధరణ' థీమ్‌తో సహకార వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. డైరక్టర్ ఎమ్.వి.రమణ వందన సమర్పణతో ముగిసిన కార్యక్రమంలో కోశాధికారి.కొండరాజు, డైరక్టర్స్ కె. శ్రీనివాస్, లాలు భూక్య, .వి.జి.మహిదర్, మాజీ ఉపాధ్యక్షులు ఎస్. సత్యనారాయణ, కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షులుఆకుల నూకరాజు, ఇ.లోకేష్, నాగబాబు, సొసైటీ సీనియర్ మేనేజర్ కె.దామోదర్ రెడ్డి, కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది, త్రిఫ్ట్ సొసైటీ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

నేరాలు ఘోరాలు

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో నరసాపురం గ్రామంలో కొబ్బరి చెట్టుపై నుండి కింద పడి బూర నరసింగరావు(35) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. గ్రామంలో అయ్యప్ప స్వాముల అంబల భజన సందర్భంగా కొబ్బరి పువ్వు కోయడానికి చెట్టు ఎక్కిన నేపథ్యంలో చెట్టుపై నుండి పడి ప్రాణాలు విడిచాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

ఘర్షణలో అక్క మృత్యువాత

ప్రజాశక్తి-పెందుర్తి : భార్యాభర్తల మధ్య వివాదంతో కూతురినిచ్చి పెళ్లి చేసిన సొంత అక్కనే పొట్టన పెట్టుకున్న తమ్ముడి ఉదంతమిది. 97వ వార్డు చినముషిడివాడ దరి గణేష్‌నగర్‌లో సోమవారంచోటు చేసుకున్న ఘటనకు సంబంధించి సిఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.

గణేష్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ టీచర్ కె.సన్యాసిరావు, తన సొంత అక్క దొగ్గ లక్ష్మి (57) కూతురు ప్రత్యూషను పెళ్లిచేసుకున్నాడు. దంపతుల మధ్య కొన్నాళ్లుగా విబేధాలు రావడంతో తరచూ ప్రత్యూష కన్నవారింటికి వెళ్లి ఉండిపోతుండేది. ఈ నేపథ్యంతో సోమవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో అత్తారింటికి వచ్చి సన్యాసిరావు, తన అక్క లక్ష్మితో గొడవ పడ్డాడు. ఘర్షణలో దొగ్గ లక్ష్మి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో మృతి చెందిందని సిఐ తెలిపారు. సమాచారం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకుని, కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతురాలు లక్ష్మికి ముగ్గురు కుమార్తెలున్నారు.

చోరీ కేసులో నాలుగు నెలల జైలుశిక్ష

ప్రజాశక్తి,-ఆనందపురం: దొంగతనం కేసులో నిందితునికి నాలుగు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి విజయలక్ష్మి తీర్పు ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మండలంలోని బోయపాలెంలో శశి స్కూల్ వాచ్‌మ్యాన్ అప్పారావు ఇంట్లో 2021 జూన్ ఒకటిన విశాఖపట్నం పూర్ణ మార్కెట్‌కు చెందిన లావేటి దుర్గారావు, మావన్న హరి ఇద్దరూ చోరీకి పాల్పడ్డారు. దీనిపై కేసు దర్యాప్తు అనంతరం స్థానిక క్రైమ్ ఎస్ఐ మన్మథరావు ఆధ్వర్యంలో నేరాభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేయగా, విచారణ అనంతరం కేసులో ఒకటో ముద్దాయిగా ఉన్న లావేటి దుర్గారావుకు నాలుగు నెలలు జైలుశిక్ష. జరిమానా విధించారు. మరో నిందితుడు హరికి పిఒ యాక్ట్ ప్రకారం విడిచిపెట్టారని పోలీసులు తెలిపారు.

భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు వరలక్ష్మినగర్ దరి విశాఖ అంబికా డోర్స్ వుడ్ వరల్డ్ కంపెనీలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో గోదాంలోని సామగ్రి అంతా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చి మంటలును అదుపు చేయడానికి చాలా సమయం పట్టింది. ప్రధాన రహదారి కావడంతో చుట్టుపక్కల వారు స్థానికులు సంఘటనాస్థలిలో గుమిగూడారు. రూ. లక్షల్లో నష్టం వాటిల్లిందని యాజమాని వాపోతున్నాడు.

బిసి రోడ్డులో 'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 66వ వార్డులో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని బిసి రోడ్డులో గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను వివరించి, ప్రతి కుటుంబానికి హామీ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, వార్డు అధ్యక్షులు మొహమ్మద్ ముర్తజా, జిల్లా కార్యదర్శి గోమాడ వాసు, రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, స్వర్ణ పూడి రాంబాయి, సరోజినీ, జయలత, సత్యనారాయణ, లక్ష్మణరావు, గూడెపు సత్యనారాయణ, పవన్ కుమార్, చింటూ, సాయిరాం, అప్పారావు, మైనార్టీ నాయకులు అన్సర్ వలి, జహంగీర్, జబ్బార్, ఖాదర్ వలీ, అన్వర్, మున్వర్, శంషుద్దీన్, షబ్బీర్ పాల్గొన్నారు.

స్పందనకు ఐదు అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి, ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఐదు అర్జీలు వచ్చాయి. పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి చెరొకటి, ప్రజారోగ్యానికి సంబంధించి మూడు అర్జీలను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు అందజేశారు

బిఆర్‌టిఎస్ బాధితులకు న్యాయం చేయాలి



సిపిపికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం తొలిపావంచా నుంచి అడవివరం వరకు బిఆర్‌టిఎస్ రోడ్డు నిర్మాణంలో బాధితులైన వారికి సరైన న్యాయం చేయాలని సిపిఎం నేతలు కోరారు. ఈ మేరకు జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆధ్వర్యంలో గోపాలపట్నం జోన్ నాయకులు బి వెంకటరావు, బాధితులతో సిసిపిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిసిపితో మాట్లాడుతూ బాధితులు నష్టపోయిన దానికి న్యాయపరిహారాన్ని, టిడిఆర్‌లనులిచ్చి, ఇళ్లస్థలాలను మంజూరుచేసి సమన్యాయం చేయాలని కోరారు. దీనిపై సిసిపి స్పందిస్తూ బాధిత నిర్వాసితులు ఒక్కొక్కరుగా వినతిపత్రం ఇస్తే పరిశీలించి న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

జ్యూట్ కార్మికుల బకాయి చెల్లించాలి



సమావేశం లో పలు కార్మిక సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : నాలుగేళ్ల క్రితం జరిగిన ఒప్పందం మేరకు చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని పలు కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్మికసంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాకాస అధ్యక్ష, కార్యదర్శులు జెవి కైలాసరెడ్డి, ఎం.ఆదినారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, టియన్‌టియుసి ప్రతినిధులు ఎంవి గురుమూర్తి, ఎన్ రామారావు పాల్గొన్నారు. కార్మికుల బకాయి చెల్లింపులో యాజమాన్యం మొండివైఖరిని ఖండించారు.

నిబద్ధతతో ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితా పరిశీలనను పర్యవేక్షిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఓటర్ల జాబితా తయారీలో నిబద్ధతతో వ్యవహరించాలని, ఎటువంటి లోపాలున్నా సహించేది లేదని బిఎల్‌ఒలకు సీతమ్మధార తహశీల్దార్ ఆనంద్‌కుమార్ సూచించారు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పరిశీలనను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓటర్లను గుర్తించేటప్పుడు బిఎల్‌ఒలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. చనిపోయిన ఓటర్లను తొలగింపులో పారదర్శకత పాటించాలన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- గాజువాక : స్థానిక చైతన్యనగర్‌లోని చైతన్య టెక్నో పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఎం అరుణకుమారి జ్యోతిప్రజ్వలన అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.కార్యక్రమంలో ఎఐ సత్యనారాయణ, మిడ్ స్కూల్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులను ఎజిఎం సురేష్, ఆర్‌ఐ మాకిరెడ్డి రమణ అభినందించారు.

రెగ్యులరైజేషన్, ఇతర సమస్యల పరిష్కారానికి
మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, కనీస వేతనం అమలు, సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జివిఎంసి జోనల్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

విశాఖపట్నం :రెగ్యులరైజేషన్, సమాన పనికి సమానవేతనం, ఇతర సమస్య పరిష్కారంతోపాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నా చేశారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఐదో జోన్ యూనియన్ సిఐటియు సెక్రటరీ ఒ అప్పారావు, అధ్యక్షులు వి మహేశ్వరి, సిఐటియు నాయకులు ఎస్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బంగారయ్య, సత్యవతి, రమణ, దుర్గారావు, నాగరాజు, సత్యారావు, జగన్, కుమారి, రాజబాబు పాల్గొన్నారు

భీమునిపట్నం : సమస్యల పరిష్కారానికి జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కనీస వేతనం రూ 26 వేలు చెల్లింపు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, యూనియన్ నాయకులు సురేష్, రాజు పాల్గొన్నారు

అనంతరం జెడ్పీ రాము కు వినతి పత్రం అందజేశారు

పిఎం పాలెం: సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం చెల్లింపు, ఇతర దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని .ఎపి మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, సిఐటియు జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎంవి.ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిరసనల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌ల వద్ద వంటావార్పు ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి రత్నం, మధురవాడ జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామప్పుడు, సి హెచ్ శేషుబాబు,కె.ఈశ్వరరావు, కె.అర్జునమ్మ, బి నరసింగరావు, పి జాన్ పాల్గొన్నారు.

ములగాడ: మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, విపక్షంలో ఉన్నప్పుడు హామీనిచ్చిన ప్రస్తుత సిఎం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని మండిపడ్డారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. ధర్నాలో మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.రమణ, సహాయకార్యదర్శి బి.రాంబాబు నాయకులు బి.సూరిబాబు, డి. రాము అప్పారావు, ఆదినారాయణ, తిరుపతిరావు, రాజు, అప్పలకొండ, కుమార్, ఎన్.ఉమా, విజయ, పాప, లలిత, రవణమ్మ, దుర్గా, అప్పలకొండ, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.



జ్ఞానాపురం జోనల్ కార్యాలయం ముున్సిపల్ కార్మికుల వద్ద ధర్నా

అనకాపల్లి : జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి అనకాపల్లి జోనల్ మస్టర్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అనకాపల్లి జోనల్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సమస్యలకు కారణమైన ఆప్కాస్‌ను వెంటనే రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.ఏసు, నాగరాజు సత్యనారాయణ, మహేష్, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్, సోమాదుల వాసు, ఎస్ నూకరాజు, శేఖర్, అమ్మాజీ, శ్రీనివాసరావు, జలగడుగుల శివకుమార్, బుజ్జి పాల్గొన్నారు.



పిఎం.పాలెంలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు



శ్రీహరిపురం వార్డు కార్యాలయం వద్ద ధర్నా



అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు
ఐక్య ఉద్యమాలతో అడ్డుకట్ట



సంఘీభావంగా వామపక్ష కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి -గాజువాక: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక , ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్య ఉద్యమాలతో అడ్డుకుంటామని వామపక్ష పార్టీల కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఇందులో భాగంగా ఈ నెల 27,28 తేదీలలో విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం గాజువాక లయన్స్ క్లబ్‌లో ఆర్‌కె.కుమార్, అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశధోరణితో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో 1012 రోజులుగా దీక్షలుచేస్తున్నా కేంద్రంలో చలనం లేదన్నారు. జివిఎంసిలో సిపిఐ ఫ్లోర్‌లీడర్, 72వ వార్డు కార్పొరేటర్ ఎజె స్టాలిన్ మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్న కేంద్రం కుట్రలను ఉద్యమాలతో అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. సదస్సులో ఐఎఫ్‌టియు నేత కె మల్లయ్య, సిఐటియు నేతలు కెఎం శ్రీనివాస్, ఎం రాంబాబు, శంకరరావు, భద్రం, రామునాయుడు, నానిబాబు, విల్లా రామ్మోహన్ కుమార్, కసిరెడ్డి సత్యనారాయణ, కె. రాజబాబు, బూసి వెంకటరావు, జె. రామకృష్ణ, ఎం.మన్మధరావు, జి. ఆనంద్, రెహమాన్, కె సత్యాంజనేయ పాల్గొన్నారు.

సమస్యలను చర్చించి పరిష్కరించాలి : ఆర్‌డిఒ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కర రెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : డివిజన్ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి, పిఓటి చట్టం–1989 సమస్యలను విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో చర్చించి పరిష్కరించుకోవాలని కమిటీ చైర్మన్, ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ త్రైమాసిక సమావేశంలో పలు అంశాలపై చర్చించి, ఈమేరకు సభ్యులకు సూచనలు చేశారు.

సమగ్ర కులగణనతో అందరికీ ప్రయోజనం



జెసికి వినతిపత్రం ఇస్తున్న యాత సంఘం నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : సమగ్ర కులగణనతోనే అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని యాత కార్పొరేషన్ చైర్పర్సన్ పిల్లి సుజాత అన్నారు. సోమవారం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఆడిటోరియంలో జరిగిన కులగణన ప్రాంతీయ సదస్సులో మాట్లాడారు. కులగణనకు బీహార్ రాష్ట్ర ఫార్మెట్‌ను అమలు చేస్తే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. తరతరాలుగా అన్ని విధాలా వెనుకబడిన యాత కులస్తులకు మెరుగైన జీవన ప్రమాణాలు పొందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జెసికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమం లో యాత వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్స్ బాడితబోయిన రాములప్పడు, పోలవరపు అప్పారావు, అండిబోయినలక్ష్మి, గొంప అప్పలరాజు, పిల్లి నూకరాజు,గొడ్డి కన్నారావు, బసరమని ఈశ్వరరావు, రెడ్డి సన్యాసిరావు వనుము దేముడు,వనుము లోకేష్, అండిబోయిన అప్పారావు అంగటి రాము, రమణ పాల్గొన్నారు .

శెట్టిబలిజలను యాతలుగానే పరిగణించాలి

భీమునిపట్నం : కులగణనలో ఉత్తరాంధ్రలోని శెట్టి బలిజలను యాతలుగానే పరిగణిస్తూ బిసి' ఎ ' కేటగిరీలో ఉంచాలని యా త కార్పొరేషన్ డైరెక్టర్ బాడితబాయిన రాములప్పడు, యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతి పత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 6లక్షల మంది యాతలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, సామాజిక గుర్తింపు కోసం యాత కులస్తుల్లో కొందరు శెట్టి బలిజలుగా మార్చుకుని రిజర్వేషన్‌పరంగా నష్టపోతున్నారన్నారు. వారికి తగు న్యాయం చేయాలని కోరారు.

గాజువాక :కల్లుగీత కార్మికుల సమస్యలపై జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథన్‌కు యాత, శెట్టి బలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు సోమవారం వినతిపత్రం అందజేశారు. హైకోర్టు న్యాయవాది, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి , వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు డైరెక్టర్లు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

-ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు
-8 నుండి సమ్మెపై నోటీసులు అందజేత

ప్రజాశక్తి- కశింకోట, అనకాపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కశింకోట, అనకాపల్లి మండలాలకు చెందిన అంగన్వాడీలు సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు అనేక సమస్యలతో మానసిక ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా అధిక పని భారాన్ని పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించి వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, మినీ వర్కర్‌ని మెయిన్ వర్కర్‌గా గుర్తించాలని, అంగన్వాడి సెంటర్ నిర్వహణ ఒకే యాప్ ద్వారా కొనసాగించాలని, పోషకాహారపు సరుకులు నాణ్యత పెంచాలని, మెనూ చార్జీలు పెంచి ప్రభుత్వమే సరఫరా చేయలని డిమాండ్ చేశారు. పై సమస్యలను పరిష్కరించకుంటే డిసెంబర్ 8 నుండి సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిడిపిఓకి వినతి పత్రం, సమ్మె నోటీసు అందజేశారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు కాసులమ్మ, తనూజ, ఉమా నారాయణమ్మ, విజయ, కృష్ణవేణి, సిఐటియు నాయకులు డి శ్రీను పాల్గొన్నారు.

యలమంచిలి : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రోజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, సూపర్‌వైజర్ రంజాన్‌బీబికి సమ్మె నోటీలు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, అచ్యుతాపురం కన్వీనర్ కె.సోమునాయుడు, వరలక్ష్మి, సావిత్రి కుమారి, లక్ష్మి, జయ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సమ్మె నోటీసును ఐసిడిఎస్ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకురాలు వివి రమణమ్మ, ఎం రమణి, బి రమణమ్మ, సిహెచ్ దేవి, జి అమ్మాజీ, ఎస్ జగదీశ్వరి, ఆర్ఎస్ లక్ష్మి, డి పుష్ప దేవి, ఎం వరలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు యు.సత్యవతి, సిఐటియు నాయకులు ఎం. గౌరీశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

కె.కోటపాడు : అంగన్వాడీలకు బడ్జెట్ పెంచాలని ఇచ్చిన హామీలు నిలబెట్టాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి. వివి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్రలను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేత గండి నాయన బాబు, వ్యకాస నేత డి.వెంకన్న, సిపిఎం నేత ఎర్రదేముడు, యూనియన్ నాయకులు జి కుమారి, పి లక్ష్మి, అమ్మాజీ, భవాని, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గొలుగొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సోమవారం సిడిపిఒకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ,ఐసిడియస్‌కు బడ్జెట్ పెంచాలన్నారు. ఉద్యోగ భద్రతా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, అంగన్‌వాడి ప్రాజెక్టు నాయకులు సిహెచ్.భ్రమరాంబ, ఎం.మంగతాయారు, లక్ష్మి తదితర్లు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కారం కొరకు డిసెంబరు 8వ తేదీ నుండి నిరధిక సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. నర్సీపట్నం ఐసిడిఎస్ సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ, బిజెపి, వైసిపి ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, అంగన్‌వాడి ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, మహలక్ష్మి, నాగమణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

కలెక్టరేట్ : అంగన్‌వాడీలు డిసెంబర్ 8 నుంచి చేపట్టే సమ్మె నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి. మణి, అధ్యక్షులు వై.తులసి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి సమ్మె నోటీసును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కె.పద్మావతి, కె.బృందావతి, ఆర్.శోభారాణి, బి.శ్యామల, ఐ.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి : లోకనాథం

నక్కపల్లి : అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ డిశంబర్ 8 నుండి నిర్వహించే నిరవధిక సమ్మె నోటీసును సోమవారం యూనియన్ నాయకులు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సూపర్వైజర్ లలితకు అందజేసారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రాట్యూటి అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శాసనమండలిలో సంబంధితశాఖా మంత్రి ఆంగన్వాడీ యూనియన్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు చేయలేదన్నారు. హెల్పర్ల ప్రమోషన్‌లో నిబంధనలు రూపొందించాలని, రాజకీయజోక్యం అరికట్టాలని, సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, యూనియన్ నాయకులు నాగఫణి, నూకరత్నం, రమణమ్మ భవాని, కవిత, రాజారత్నం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కశింకోట, అనకాపల్లి మండలాల అంగన్వాడీలు



సబ్బవరంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

భవిష్యత్ గ్రోత్ హబ్‌గా అనకాపల్లి జిల్లా

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉమ్మడి విశాఖ జిల్లా నుండి కొత్త జిల్లాగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్నాయని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. విశాఖలో జరిగిన నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ ప్రాంతీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రటరీ అనా రాయ్, రాష్ట్ర ప్రణాళికా విభాగం సెక్రటరీ గిరిజా శంకర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాకు ఉన్న అభివృద్ధి అవకాశాలను వివరించారు. అనకాపల్లి జిల్లాలో 72 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, 24 మండలాలతో 4002 చదరపు కి.మీ. ప్రాంతంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 17 లక్షలకు మించిన జనాభా ఉందని తెలిపారు. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, హెటిరో ఎస్ఈజెడ్, అచ్యుతాపురంలో ఏపీ మల్టీ సెక్టార్ ఎస్ఈజెడ్, అపిరల్ పార్క్, బ్రాండిక్స్, ఎన్టిపిసి సింహాద్రి పదివేల పైగా రిజిస్ట్రేషన్లు గల ఎమ్మెస్ఎంఇ సెక్టార్, మరో ఐదు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయని తెలిపారు. మరిన్ని పారిశ్రామిక సంస్థలు రానున్నాయని చెప్పారు. జిల్లాలో విస్తారమైన భూమి, అపారమైన మానవ వనరులు ఉన్నాయని, పారిశ్రామిక విద్యార్హతలు గల యువత, కార్మికులు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. వివిధ పంటలు విస్తారంగా పండుతాయని, వీటితో ఎన్నో కుటీర పరిశ్రమలు ఆహార పరిశ్రమలు అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రటరీ అనారాయ్, రాష్ట్ర ప్రణాళిక విభాగం సెక్రటరీ గిరిజా శంకర్ ఇతర కోస్తా జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్ ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "రైతు నుండి నేరుగా వినియోగదారులకు" రసాయనాలు లేని తాజా కూరగాయలు ,ఆకుకూరలను సరఫరా చేయడం హర్షనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన చెరుకునుండి తయారు చేసిన బెల్లం, నూనెలను, బియ్యంను స్టాల్లో ఉంచారు. ఇకపై ప్రతి సోమవారం ఈ స్టాల్ ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్, జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, డిఆర్డిఎ పిడి, ఏపీ డి డైజి, జిల్లా అధికారులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఎఎంఎఎల్ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో సోమవారం ఉద్యోగం మేళా మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అరవిందో ఫార్మా, హానర్ ల్యాబ్స్,వై ఎస్‌కే ఇన్ఫోటెక్, ఎస్ వి వి ఇన్ఫోటెక్, అపోలో ఫార్మ, వీల్స్ మార్ట్,విస్టం ఇన్ఫోటెక్, వరుణ్ బజాజ్ మొదలగు కంపెనీల హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 160 మంది హాజరు కాగా అందులో 77 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా వరుణ్ బజాజ్ 8, అరవిందో ఫార్మా 8, హానర్ ల్యాబ్స్ 7, వైఎస్కే ఇన్ఫోటెక్ 4, ఎస్ వి వి ఇన్ఫోటెక్ 23, అపోలో ఫార్మ 14, వీల్స్ మార్ట్ 9, విస్ట్రం ఇన్ఫో కాం 4 అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వర రావు, ఐక్యుఏసి కోఆర్డినేటర్ నిరంజన్ కుమార్, కళాశాల సూపరింటెండెంట్ పి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆళ్ల

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీగా అనకాపల్లికి చెందిన ఆళ్ళ ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ప్రవీణ్‌కు సీమాంధ్ర రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కండువా వేసి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చింతకాయల కొర్లయ్య, రాము పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో 1986 89 సంవత్సరంలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం కళాశాల ఆవరణలో జరిగింది. ఉదయం నుంచి పూర్వ విద్యార్థులు తమ తమ పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గోవర్ధనగిరి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక మల్లిమనుగులవారి వీధిలో వున్న హరేకృష్ణ మందిరంలో సోమవారం గోవర్ధన గిరి పూజ ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దామోదర దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆవుపేడ, బంక మట్టితో తయారు చేసిన గోవర్ధన పర్వతం, గిరిరాజ్ కృష్ణుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మందిర అధ్యక్షులు దుర్లభ కష్ణ ప్రేమ దాస్ ప్రభూజీ మాతాజీ, లావణ్య, రంగ దేవి పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో అవకతవకలను సరిచేయాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని పలు గ్రామాలలో ఓటర్ లిస్ట్‌ల్లో అవకతవకలను సరి చేయాలని కోరుతూ స్థానిక టిడిపి నాయకులు ఎన్నికల అధికారి మనోరమకు సోమవారం వినతి పత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల అధికారి బిఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు ఓటర్ లిస్టులో మరణించిన వారి పేర్లు, డబల్ ఎంట్రీలు, ఒకే డోర్ నెంబర్కు ఎక్కువ ఓట్లు ఉండటం వంటివి తొలగించి ఓటర్ లిస్ట్ సవరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో టిడిపి నాయకులు భీమర శెట్టి శ్రీనివాసరావు, మల్ల వరాహ నరసింహారావు, ఉస్తేలు నాయుడు, సూరిశెట్టి రాము ఉన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు

సామాజిక సాధికార యాత్రలో మంత్రి ధర్మాన



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నెరవేర్చకుండా ప్రజలను మోసగించారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సామాజిక సాధికార యాత్ర సోమవారం అచ్యుతాపురంలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతిపక్షాలు పని కట్టుకొని గ్యాస్ పెట్రోలు నిత్యావసర సరుకులు ధరలు పెరిగాయని ప్రచారం చేస్తున్నాయని, కాని దేశంలో అన్ని రాష్ట్రాలలో వీటి ధరలు పెరిగాయని తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పనలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. రోడ్లపై పడిన గుంతలు చూపించి ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రహదారులు వేస్తే అభివృద్ధి జరిగినట్లేనా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల జీవన విధానం మెరుగుపరిచే విధానాలు చేపట్టడం ద్వారా రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ బివి సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎలమంచిలి మున్సిపల్ చైర్పన్ పిల్ల రమకుమారి, వైయస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, నాయకులు ఆర్ జగన్నాథం, డి.సూర్యనారాయణరాజు, లేళ్ల అప్పిరెడ్డి, దేశం శెట్టి శంకర్రావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సిపిఎం నేతల గృహ నిర్బంధం

సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కె.సోమునాయుడును సోమవారం ఉదయమే పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. అనంతరం వారిని ద్విచక్ర వాహనాలపై ఎలమంచిలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ నిర్బంధ చర్యలను ప్రజాతంత్ర వాదులు ఖండించాలని సిపిఎం నేతలు కోరారు. వైసిపి ప్రభుత్వానికి సిపిఎం అంటే ఎందుకు భయమని ప్రశ్నించారు. అరెస్టులు నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని సిపిఎం నేత కర్రి అప్పారావు హెచ్చరించారు.



బైక్‌పై సిపిఎం నాయకులను తరలిస్తున్న పోలీసు

పోలీసుల నిర్బంధంపై సిపిఎం ఖండన

అనకాపల్లి : వైసిపి చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్ర అచ్యుతాపురం వస్తున్న సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, మండల నాయకులు కె.సోమునాయుడులను ఇంటి వద్ద పోలీసులు గృహ నిర్బంధించడం, అరెస్టు చేయడంపై సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కరువును, ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా సిపిఎం నాయకులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత, నిర్బంధ చర్యలను మానుకొని ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు.

వారంలో చెరకు బకాయిల చెల్లింపు

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులకు చెల్లించవలసిన బకాయి 12 కోట్ల 30 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇచ్చేందుకు అనుమతించిందని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. ఇందుకోసం జీవో విడుదల చేయడంతో పాటు మరో వారం రోజుల్లో రైతులు ఖాతాలకు బకాయిలు జమయ్యేలా చూస్తామన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో షుగర్ ఫ్యాక్టరీకి 140 కోట్ల రూపాయలు అప్పుల్లో ముంచిందన్నారు. వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు రూపంలోనూ అప్పురూపంలోనూ ప్రభుత్వం సాయం చేయడంతో ప్రస్తుతం అప్పు 40 కోట్ల రూపాయలకు తగ్గించామని చెప్పారు. ఈ ఏడాది ఫ్యాక్టరీలో అనుబంధ పరిశ్రమ ఏర్పాటు చేయడం కోసం అన్ని అనుమతులు సిద్ధమైనట్లు చెప్పారు.

జెడ్‌పి స్కూల్‌కు లౌడ్ స్పీకర్లు, ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కెనరా బ్యాంక్ ఫౌండర్స్ డే సందర్భంగా బ్యాంకు రాజాం వారు మండలంలోని రాజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోర్టబుల్ లౌడ్ స్పీకర్లు, ఆంపిల్ పేర్, మూడు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వై. వంశీ, సిబ్బంది జి.జ్ఞాన కిరణ్, ప్రధానోపాధ్యాయులు జి. అనిల్ కుమార్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేపీఎ జెడ్‌పి హైస్కూల్‌లో వాలంటీర్లకు ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జడ్పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ నవంబర్ 20 నుండి మొదలగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శేషుబాబు, ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఆర్ వెంకట్రావు, పిఈటి నర్సింగరావు, వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి, కోవేల జనార్దన్ రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఎం, ఎంఇఒలకు శిక్షణ

ప్రజాశక్తి -కశింకోట : హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు డిపిఎన్ హైస్కూల్లో సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం విద్యను అందించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. అప్పారావు, జె రవీంద్రబాబు, శేషగిరిరావు పట్నాయక్ ,శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-కశింకోట : జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో లేగ దూడల అందాల పోటీలను వెదురుపర్తిలో సోమవారం నిర్వహించారు. వీటిని ప్రారంభించిన డివిఎల్‌డిఏ నిర్వహణ అధికారి డాక్టర్ బి రామ్మోహనరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని చెప్పారు. అనంతరం ఆరోగ్యంగా ధృఢంగా ఉన్న దూడలను గుర్తించి ప్రథమ బహుమతి శనివాడ వెంకటరమణ ఒంగోలు దూడకు, ద్వితీయ బహుమతి దమ్ము అప్పారావు హెచ్ఎఫ్ దూడకు, తృతీయ బహుమతి సేనాపతి రాము ముర్రా దూడ యజమానులకు అందజేశారు. గిర్ దూడకు, జెర్సీ దూడ, హెచ్ఎఫ్ దూడకు స్పెషల్ ప్రైజ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి దూడ పెయ్యిలను తీసుకువచ్చిన 44 మంది రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్ కరుణాకర్‌రావు, సర్పంచ్ శనివాడ అరుణ, ఉప సర్పంచ్ ఆళ్ల జగదీష్, అల్లవరపు నాగు, డాక్టర్ బి సౌజన్య, డాక్టర్ అల్ఫోన్సా జార్జ్, సంధ్య, పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు డిపిఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి గౌరీ వ్యాయామ శాలలో జరిగిన ఉమ్మడి జిల్లాల 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్ 17 బాల బాలికల విభాగంలో కె.దిలీప్, టి.శ్యామల గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎంఆర్‌వి. అప్పారావు సోమవారం తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు వి.ప్రభాకరరావు, ఉపాధ్యాయులు డివిఆర్‌కె. శర్మ, అప్పారావు, ఎ. నాగేశ్వరరావు, ఈ.రామారావు, ఆచంట రవి, సునీత, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మేరీ జోన్స్ అభినందించారు.

శివాలయానికి 10 కేజీల వెండి నాగాభరణం వితరణ

చోడవరం రూరల్ : చోడవరం స్వయంభు శివాలయానికి 10 కేజీల వెండి ఆభరణాన్ని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సతీసమేతంగా సోమవారం వితరణ చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పూజలు చేసి గుడిలోని శివునికి నాగాభరణాన్ని విగ్రహానికి అలంకరించారు.

చంద్రబాబుకు బెయిల్‌పై సంబరం



బాణసంచా కాల్చుతున్న టిడిపి నేత నాగజగదీష్ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ డెవలప్మెంట్ కేసులో హైకోర్టు స్టే ఇవ్వడంపై టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు పూర్తిస్థాయి బెయిల్ రావడం తమకు ఎంతో ఆనందం ఇచ్చిందన్నారు. టిడిపి జనసేన నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్, విల్లూరి రమణ బాబు, డాక్టర్ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, కడిమిశెట్టి నరసింహారావు, గుడాల సత్యనారాయణ, సూరే సతీష్, గుర్రం నూకరాజు, గింజల లక్ష్మణరావు పాల్గొన్నారు.

పైలా, గవిరెడ్డి హర్షం

కె.కోటపాడు, దేవరాపల్లి : చంద్రబాబుకు హైకోర్టు బెయిలు మంజూరు చేయడం పట్ల టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించినట్లు వారు పేర్కొన్నారు. చంద్రబాబు మునుపటి ఉత్సాహంతో ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సేవకు పునరంకితం కావాలని వారు ఆకాంక్షించారు.



భోగలింగేశ్వర స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

భక్తులతో శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి- అనకాపల్లి

కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో పలు శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాల ముందు బారులు తీరారు. స్థానిక భోగలింగేశ్వర స్వామి దేవాలయం, కాశీ విశ్వేశ్వర ఆలయం, సిద్ధి లింగేశ్వర, రామలింగేశ్వర దేవాలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అన్నమయ వాగ్దేవి వరదాయిని తిమ్మాపాత్రుని చక్రవర్తి వెంకటేశ్వర స్వామి కోవెల దేవస్థానం చైర్మన్ సకల గోవింద, భోగ లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శివ భక్తి గీతాలు, కోలాటం, నృత్యాలు, భక్తి గీత ఆలాపన నిర్వహించారు.

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున మూడు గంటల నుంచి అధిక సంఖ్యలో మహిళలతో పాటు పురుషులు పాల్గొని మొక్కులు తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో దర్శనమిచ్చారు.

సామాజిక, ఆర్థిక స్థితిగతుల బట్టి కుల గణన

ప్రజాశక్తి-అనకాపల్లి : కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను బట్టి కుల గణన నిర్వహించవలసి ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి కుల గణన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధి, అణగారిన వృత్తులు అనుసరిస్తున్న వృత్తులను బట్టి వారి సమస్యలను తెరపైకి తీసుకురావడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. నిజమైన అర్హత కలిగి ఉండి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందనివారికి లబ్ది చేకూర్చడానికి ప్రభుత్వం కుల గణనను చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మండలస్థాయి, బుధవారం గ్రామస్థాయి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ డిడి కె రాజేశ్వరి మాట్లాడుతూ కుల గణన సర్వే నిర్వహణపై ప్రభుత్వం విడుదల చేసిన విధి విధానాలను తాసిల్దార్లు ఎంపీడీవోలు పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామా పీడీ ఈ.సందీప్ సర్వే నిర్వహణపై విధివిధానాలపై తెలియజేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దగ్గర పోలికలు ఉన్న సామాజిక వర్గాలను ఉదహరిస్తూ రాష్ట్రంలో ఉన్న వివిధ సామాజిక వర్గాలు, కులాలను గూర్చి విశదీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల వాణి, జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్తహీనత అరికట్టాలి

ప్రజాశక్తి - యలమంచిలి : విద్యార్థుల్లో రక్త హీనతను అరికట్టాలని పేట బయ్యవరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అన్నారు. రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం పాఠశాల విద్యార్థులు 123 మందికి రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోమిన్ తక్కువున్న విద్యార్థులు తాము తీసుకొనే ఆహారంలో ఆకుకూరలు, పాలు, పండ్లు, గుడ్లు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. వారికి ఐరన్ మాత్రలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బొడ్డేడ సత్యనారాయణ, ఇఎడి నెహ్రూ, జె శ్రీను, దేవి, లత, గోవమ్మ, రాణి, రాజా పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. తిరస్కరించిన వారికిచ్చే సమాధానంలో అందుకు గల కారణాలను వివరించాలన్నారు. సోమవారం నాటి స్పందనకు 425 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. జెసితో పాటు డిఆర్ఓ బి. దయానిధి, ఎస్.డి.సి.లు కె.రమామణి, ఏ. మహేష్, డ్వామా పీడీ ఇ.సందీప్, దరఖాస్తులు స్వీకరించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి- కశింకోట : ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జి.భీమవరం సర్పంచ్ హనుమంత్ వెంకట లక్ష్మణరావు అన్నారు. కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్యాధికారి ఆధ్వర్యాన వైద్య శిబిరం సోమవారం జరిగింది. డాక్టర్ లావణ్య పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

సెల్ టవర్ ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి -రావికమతం: సెల్ టవర్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో పొర్లుపాలెం గ్రామస్తులు తహాసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోకివాడ రమణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శివలంక కొండలరావు మాట్లాడుతూ, మండలంలో తట్టబంద పంచాయతీ పొర్లుపాలెం గ్రామానికి అంగన్వాడి, పాఠశాల, సామాజిక భవనం, రక్షిత మంచినీటి పథకం, మినీ గ్రంథాలయం, ప్రాథమిక ఉపకేంద్రం మంజూరు చేయాలని గత కొంతకాలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. వీటి కోసం కేటాయించిన స్థలంలో గ్రామస్తుల అభ్యంతరాలకు వ్యతిరేకంగా సెల్ టవర్ నిర్మాణానికి ప్రతిపాదించడం సరికాదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసిల్దార్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామంలో ప్రభుత్వ స్థలాలన్నీ ఆక్రమణలో ఉన్నందున సర్వే నంబరు 39లో రెండు స్థలం ఖాళీగా ఉన్నందున సెల్ టవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వ స్థలాలు స్వచ్ఛందంగా అప్పగిస్తే గ్రామస్తులకు ఇబ్బంది లేని ప్రభుత్వ స్థలంలో సెల్ టవర్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జోగురాజు, వార్డుమెంబర్ ఎజ్జి శ్రీను, రమణ, ఎంగలి ఈశ్వరరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



నర్సీపట్నంలో బహుమతులతో విద్యార్థులు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రంథాలయాల్లో ఈ వారం రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతుల ప్రదానం చేశారు.

యలమంచిలి:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవ ముగింపు సమావేశం ఎంపిపి బోదెపు గోవిందరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహశీల్దార్ రాణీ అమ్మాజీ వ్యాసరచన, వక్తృత్వ, పాటలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, బొద్దపు ఎర్రయ్యదొర, వనం నాగు, డిగ్రీ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ పూరీజగన్నాథ్, లైబ్రేరియన్ వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట శాఖ గ్రంథాలయంలో గ్రామ సర్పంచ్ మంత్రి జయ రజిని చేతులు మీదుగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి కె.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. తాళ్లపాలెంలో ఎంపిటిసి లగిశెట్టి భవాని గణేష్, గురుకుల పాఠశాల గ్రంథాలయ అధికారి ఎం.భారతి, గాయత్రి స్కూలు ప్రిన్సిపల్ వై.నగేష్, భార్గవి విద్యా మందిర్ కరస్పాండెంట్ డి.రవి, చిన్ని భాస్కర్‌రావు, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం విజేతలకు బహుమతులు అందజేశారు.

కె.కోటపాడు : మండలంలోని కె.కోటపాడు, చౌడువాడ శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ-2 డివిడి ప్రసాద్ మాట్లాడారు. చౌడువాడలో గ్రంథాలయ అధికారి పద్మావతి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు బహుమతులు అందజేశారు. హెచ్ఎం అప్పారావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: క్విజ్, వ్యాసరచన, పుస్తక పఠనం తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సోమవారం బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక శాఖ వీధి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు అధ్వర్యంలో ముగింపు వేడుకలు జరిగాయి. దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ, సిద్దార్ధ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, కవి మిత్రులు జి.రంగబాబు, ఐ.చక్రపాణి, జి.ఎస్.కె.సాయిబాబా, మాజీ గ్రంథాలయాధికారులు బూడిద నాగేశ్వరరావు, బి.రామారావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో ఎమ్‌పిపి బోకం సూర్యకుమారి రాము నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సరిటిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి శిరీష, వైస్ ఎమ్‌పిపి చొక్కాకుల గోవింద్, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎమ్ఈఓ సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథలయంలో జరిగిన ముగింపు ఉత్సవాల్లో ఎంఇఒ కాశీ నాయుడు బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ, ప్రియదర్శిని విద్యాసంస్థల కరస్పాండెంట్ వీరు నాయుడు, వైసిపి నేత ఆడారి కాశిబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు ఉత్సవాల్లో మండల తహశీల్దారు వై.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. జెడ్పిటిసి లాలం రాంబాబు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎన్ కుమార్, సర్పంచ్ కే విమలా నాయుడు, అచ్చుతా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పి శేషగిరిరావు, గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్‌లో సహాయ ప్రధానోపాధ్యాయురాలు కుమారి, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఈఓపిఆర్డి సత్యనారాయణ, విశ్రాంత గ్రంథాలయాధికారి మూర్తి హాజరయ్యారు. చినదొడ్డుగల్లులో గ్రంథాలయ అధికారి కే.జనార్దన్, బ్యాంకు మేనేజర్ సందీప్ పాల్గొన్నారు .

మాడుగుల:స్థానిక గ్రామ పంచాయతీ సచివా లయ కార్యాలయంలో గ్రంథాలయ అధికారి వై వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన నిర్వహించారు. విద్యార్థులకు ఎంపిపి వేమవరపు రామధర్మజ బహుమతి ప్రధానం చేశారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, జవ్వాది వరహాలు, వైయస్సార్‌సిపి కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాస్, హేమంత్ పాల్గొన్నారు.

కోటవురట్ల:గ్రంథాలయాలు విద్యా బాండాగారాలని జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి రామారావు, పిఓపిఆర్డి బానోజీరావు, గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలో గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో వారోత్సవాలు ముగిశాయి. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ పి.రామారావు. సబ్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ అనూష బహుమతులు అందజేశారు. ఏఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:ఇప్పటికీ పుస్తకం ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని తహశీల్దార్ సిహెచ్.అన్నాజీరావు అన్నారు. గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఇఒ సిహెచ్.తలుపులు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులు వెలగా నారాయణరావు,జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు, విశ్రాంత లైబ్రేరియన్ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాయకరావుపేట:స్థానిక వైజంక్షన్లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.మాణిక్యాలరావు, ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ, డీన్ విజయ్, ఏవో విజయ్, సి బ్యాచ్ ఇంచార్జ్ లోవేశ్వరరావు పాల్గొన్నారు.

గొలుగొండ:గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లోని విజేతలకు సర్పంచ్ కసిపల్లి బుజ్జి(అప్పారావు) చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ అప్పారావు, ఉపాధ్యాయులు బాబురావు, రాజేశ్వరి, అంబేద్కర్, లెక్చరర్ క్రాంతి మాస్టర్ పాల్గొన్నారు.

రోలుగుంట: గ్రంధాలయాధికారి వరలక్ష్మీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రంధాలయ వారోత్సవాలు ముగిశాయి. ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

పద్మనాభం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపులో ఎంపిపి రాంబాబు విజేతలకు బహుమతులను అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ టి.పాప, కోరాడ లక్ష్మణరావు, టి. పద్మనాభం పాల్గొన్నారు,

భీమునిపట్నం: శాఖా గ్రంధాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు లైబ్రేరియన్ మహేష్ అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు త్రినాథరావు, విశ్రాంత ఉద్యోగ,ఉపాధ్యాయులు ఎం ఆనందరావు, ద త్తి ఈశ్వర రావు, సీనియర్ న్యాయవాది పార్వతీశం, మాజీ కౌన్సిలర్ ఎం లక్ష్మణరావు బహమతులు అందజేశారు.

గోపాలపట్నం :రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత, గ్రంథాలయ అభివద్ధి కమిటీ సభ్యులు నందవరపు సోములు. ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎంఎన్.వి. శ్రీనివాసరావు, చందు సుబ్బారావు, ఎల్లపు చిన్న అప్పారావు. గోరకాల రామదాసు పాల్గొన్నారు.

ఆనందపురం: శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపులో సర్పంచ్ చందక లక్ష్మి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. లైబ్రేరియన్ బివిఎస్ అప్పారావు, ఉపసర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ, చందక సూరిబాబు, చందక అప్పల నాయుడు, పంచాయతీ కార్యదర్శి రామమూర్తి, కొట్యాడ రెడ్డిబాబు, కొట్యాడ సత్యమూర్తి, హరికృష్ణ పాల్గొన్నారు.

ములగాడ: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, యాజమాన్య ప్రతినిధి సిస్టర్ జానిస్, ఎంఇఒలు త్రినాధ్. వెంకటరావు ,ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వై. అనసూయా దేవి, గ్రంథాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో గ్రంథాలయాధికారి జి. శిరీష ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ నగరశాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త సుసర్ల సర్వేశ్వరశాస్త్రి హాజరయ్యారు. పలు పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరశాఖ గ్రంథాలయాధికారి కెవిఎ. ఉమామహేశ్వరరావు, కిరణ్ కుమార్ రాజు, కె బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ అనిల్ కుమార్

ఉపాధి హామీ పనులపై గ్రామసభలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి క్లారిట్ యాప్ ద్వారా కొత్త పనులు గుర్తిస్తామని ఉపాధి హామీ ఏపీవో గంగు నాయుడు తెలిపారు. సోమవారం ఉపాధి సిబ్బంది కోటవురట్ల, అన్నవరం, ఎండపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పనుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. కోటవురట్ల గ్రామానికి రూ.1.50 కోట్లతో పనులు గుర్తించనున్నట్లు తెలిపారు. అన్నవరంలో రూ.40 లక్షలు, ఎండపల్లిలో 43 లక్షలతో పనులు గ్రామసభ ద్వారా ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆయా గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట:మండలంలోని కొవ్వూరు గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-2025 సంవత్సరంలో చేపట్టే పనుల మ్యాప్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ మాట్లాడుతూ, వంద రోజుల ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ, ఉపాధి హామీ మేట్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున వైసిపి నేతలు

ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, నాయకులు భేతిరెడ్డి విజయ్, చెరుకురి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపెట్ల ఉమాశంకర్‌గణేష్ సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట సతీమణి కళావతి, కుమారులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో సోమవారం నర్సీపట్నం మార్కెట్ కమిటీ చెర్మన్ చిటికెల భాస్కరనాయుడు, సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే గణేష్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కొండతల్లి, ఎంపిటిసి మామిడి కృష్ణ, సచివాలయ కన్వీనర్ లగుడు ప్రకాష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులులు పి.శివసత్యనారాయణ పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-మాడుగుల:విద్యుత్ ప్రమాదంలో విలువైన గృహోపకరణాలు పూర్తిగా దగ్ధ మయ్యాయి. సోమవారం తెల్లవారు జామున మండలంలోని కేజేపురం గ్రామానికి చెందిన ఎల్లపు కొండారావు గృహంలో విద్యుత్ వైర్లు కాలి పోయాయి. దీంతో గృహంలో ఫ్రిడ్జ్, కంప్యూటర్, ఫ్యాన్ వంటి వస్తువులు పూర్తిగా కాలి పోయాయి.



దగ్ధమైన గృహోపకరణాలు

మత్స్యకారులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి సుమారు 60 బోట్లు అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయని, ఒక్కో బోటు ఖరీదు సుమారు రూ.40 లక్షల నుంచి రూ. 50 లక్షలు ఉంటుందని, పూర్తిగా కాలిపోయిన బోట్లుకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి మత్స్యకారులను ఆదుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్‌లోని ప్రమాద ప్రాంతంలో సోమవారం సిపిఎం జిల్లా బృందం పర్యటించింది. ఈ పర్యటనలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, ఎం.సుబ్బారావు, వై.రాజు, కెవిపి.చంద్రమౌళి, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు ఉన్నారు. ఈ సందర్భంగా ఎం.జగ్గునాయుడు, బి.గంగారావు మాట్లాడుతూ, ఇక్కడకు వచ్చిన మత్స్యకార శాఖ మంత్రి డాక్టర్ సీదరి అప్పలరాజు కాలిపోయిన బోటుకు 80 శాతం నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, మత్స్యకార సోదరులు ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి బోటుకూ నూరు శాతం నష్టపరిహారం చెల్లించాలని, ఈ బోటుపై ఆధారపడిన కుటుంబాలతో పాటు దీని ఆధారంగా ఉపాధి పొందుతున్న సుమారు వెయ్యికుటుంబాలకు ప్రభుత్వం కనీసం మూడు నెలల వరకు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. బోటు ఖరీదే కాకుండా బోటులో ఉండే సరుకు, డీజిల్, ఇతర సామాగ్రిని కూడా పరిగణలోకి తీసుకొని పూర్తి నష్టపరిహారం చెల్లించాలని మంత్రిని సిపిఎం నాయకులు కోరారు. మంత్రి వచ్చి మీడియాతో మాట్లాడి వెళ్ళిపోయారు తప్ప, నష్టపోయిన మత్స్యకారులతో కనీసం చర్చించలేదని విమర్శించారు. సముద్రంలో ఒక బోటు మంటలకు గురైతే దానిని నివారించకపోవడంతో సుమారు 60 బోట్లు ఆగ్నికి ఆహుతయ్యాయన్నారు. ప్రమాదాల నివారణకు ఎటువంటి భద్రతా చర్యలు లేకపోవడం, సముద్రంలో ఉన్న బోటు మంటల నుంచి రక్షించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. మెరైన్ పోలీస్ వ్యవస్థ లేకపోవడం, జెట్టీ విస్తరణ కాకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రూ.150 కోట్లతో జెట్టి విస్తరణ పనులకు మంజూరు చేసినట్లు మంత్రి చెపుతున్నారని, అలాంటప్పుడు ఇంతవరకు విస్తరణ పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు వేల ఎకరాల భూమిని దారాదత్తం చేస్తున్న ప్రభుత్వం వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న మత్స్యకారుల జెట్టీకి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గం అన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని మత్స్యకారులకు తగిన న్యాయం చేయాలని, మెరైన్ పోలీస్ వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్‌చేశారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు జగ్గునాయుడు, గంగారావు తదితరులు

రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి : చంద్రశేఖర్

ప్రమాదంలో నష్టపోయిన ఒక్కొక్క బోటుకు రూ.50 లక్షలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. సముద్రంలో మునిగిపోయిన బోట్లను తొలగిస్తే జెట్టీల వద్ద ఖాళీ ఏర్పడి బోట్లను దూర దూరంగా పార్కింగ్ చేసుకునే అవకాశం ఉండేదన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న బివి రామ్

సమగ్ర విచారణ చేపట్టాలి : సిపిఐ

ఫిషింగ్ హార్బర్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. నిఘా వైఫల్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు.

బాధితులను ఆదుకోవాలి : టిడిపి

ఫిషింగ్ హార్బర్ ప్రమాద బాధితులను తక్షణమే ఆదుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన అనంతరం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, దుర్ఘటనపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రెంట్ సెస్ తీసుకుంటున్న పోర్ట్ ట్రస్ట్ బాధ్యత వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, మాజీ మంత్రి కొండ్రు మురళి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సిబిఐ విచారణ జరపాలి : బివి.రామ్

విశాఖ ఫిషింగ్ హార్బర్ ఘటనలో రాజకీయ కోణం ఉందని తాము అనుమానిస్తున్నామని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘటనపై సిబిఐ విచారణకు ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి ఆయన మాట్లాడారు.

హెచ్‌సికి ప్రశంసాపత్రం అందజేత

ప్రజాశక్తి-చీడికాడ: స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గోవిందరావుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. మండలంలోని కొనాం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న గోవింద రావు ఇటీవల అక్రమంగా గంజాయి తరలిస్తున్న కారును అడ్డగించి సినీ పక్కిలో స్వాధీన పరుచుకున్నారు. సమాచారాన్ని ఎస్ఐ పి రామారావుకు అందించి తప్పించుకుని పారిపోయిన నిందితులను ఎస్సై ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్‌కు అనకాపల్లి జిల్లా ఎస్పీ శనివారం తన కార్యాలయంలో ప్రశంస పత్రాన్ని అందజేశారు.



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ఎస్‌పి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

స్పందన వినతులు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్పందనలో వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపుతామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం తెలిపారు. నర్సీపట్నం రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పందన సమస్యల పట్ల అధికారులు దృష్టి సారించాలన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా పేల్చారు.

మాడుగుల: టిడిపి అధినేత చంద్ర బాబుకు బెయిల్ రావడంపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నిజాయితీపరుడని, కోర్టులు సైతం నమ్ముతున్నాయని తెలిపారు. అందుకే చంద్రబాబు నాయుడు అరెస్టును ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించి సంఘీభావం తెలిపారన్నారు. తెలుగుదేశం నాయకులు ఉండూరు దేవుడు, పుప్పాల అప్పలరాజు , ఒంగ్రు గంగమ్మ కృష్ణ, మజ్జి తాతబాబు, వడ్డీ రాజ్ కుమార్‌లు హర్షం ప్రకటించారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన ప్రాంత్ స్థాయి భారత్ కో జానో క్విజ్ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవశం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో అజితేష్ త్రిపాఠీ, గణేష్ పార్థు బహుమతి సాధించి ఈనెల 26న విశాఖపట్నంలో జరిగే రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో లలిత శరణ్య, ఇ.హర్షిత ద్వితీయ స్థానాన్ని సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి. వి.ఎస్. మూర్తి అభినందించారు.



బహుమతులతో విద్యార్థులు

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-నక్కపల్లి: కరువుతో రైతులు ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వానికి పట్టకపోవడం అత్యంత దారుణమని, తక్షణమే అనకాపల్లి ని కరువు జిల్లాగా ప్రకటించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెంలో రైతులతో కలిసి ఎండిపోయిన వరి పొలాలు పరిశీలించారు. రైతులు వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి వర్షాలు లేక ఎండిపోయిన వరి పొలాలు చూసి ఆయన ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వర్షా భావ లోటు కారణంగా ఇంత తీవ్రంగా కరువు కాటకాలతో రైతులు, కూలీలు అల్లాడుపోతుంటే, ప్రభుత్వం ఇంతవరకు ఆదుకునే చర్యలు చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో 679 మండలాలకు 350 మండలాల పై వర్షాలు పడక తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉంటే కేవలం 7 జిల్లాలో 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు.


అనకాపల్లి జిల్లా లో ఎన్నడూ లేని విధంగా కరువు ఉండగా అధికార పార్టీ మంత్రులు సాధికార బస్సు యాత్రలు చేస్తూన్నారని విమర్శించారు. పొలం బాట పడితే జిల్లాలో ఉన్న కరువు, రైతులు కష్టాలు కనబడతాయన్నారు. ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా జిల్లా పరిషత్ సమావేశంలో కరువు జిల్లాగా ప్రకటించాలని తీర్మానం చేశారని, తీర్మానం చేసి చేతులు దులుపుకోవడం కాకుండా జిల్లా మంత్రులకు జిల్లాలో ఉన్న కరువు పరిస్థితులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ఒత్తిడి తెచ్చి వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణ చర్యలు చేపట్టాలని రైతులను, కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.బంగార్రాజు, ఎం.శ్రీను, డి.నానీ,జీ.రమణ,జీ.శేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- నక్కపల్లి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని వైసిపి మండల శాఖ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి అన్నారు. నక్కపల్లి సచివాలయం -1 పరిధిలో సోమవారం ఏపీకు జగన్ నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఫ్లెక్సీని సర్పంచ్ జయ రత్న కుమారి, నాయకులు ఆవిష్కరించారు. ఈఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నానాజీ, నక్కపల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి తాతబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని చోద్యం గ్రామంలో ఏపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రాజుబాబు, వైస్ ఎంపిపి ఆదినారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి: మండలంలోని సిహెచ్ఎన్ అగ్రహారంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డును మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లిమల్ల గోవిందరావు, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, వైసిపి నాయకులు కోరుకొండ అర్జునరావు, బంటు శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో హాజరైన నేతలు

కశింకోట : కసింకోట మండలం తేగడ గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును సోమవారం మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పెంటపాడు జ్యోతి శ్రీనివాసరావు, తేగాడా సర్పంచి నీటిపల్లి లక్ష్మి, నీటిపల్లి దివాకర్ పాల్గొన్నారు.

సీతమ్మధార : ఎపి అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. సోమవారం 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో తమిళ్ కల్యాణ మండపంలో, 55వార్డు కార్పొరేటర్ శశికళ ఆధ్వర్యంలో ఫీట్ రోడ్, తాటిచెట్లపాలెం వాటర్ ట్యాంక్ వద్ద ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులు వివరాల బోర్డులను ప్రారంభించారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 42వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, జి.వి రమణి, పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని కొవ్వాడలో గ్రామ కార్యదర్శి అప్పలరాజు ఆధ్వర్యంలో ఎపికి జనగ్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు.ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు.

తగరపువలస: జివిఎంసి ఒకటో వార్డు బంగ్లామెట్టలో ఎపికి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజు పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షులు జగుపిళ్ల ప్రసాదరావు, జె వెంకటరెడ్డి, జీవి రమణ, పందిరి విజయ్, వి వెంకట రమణ, వంశీ రెడ్డి పాల్గొన్నారు.